పశుసంపదను కాపాడుకుందాం

- ఎండ తీవ్రతపై పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలి
- ఉదయం, సాయంత్రం సమయాల్లో మేతకు వదలాలి
- నీటిలో కొంత బెల్లం, ఉప్పు వేసి పశువులకు తాగించాలి



ఘట్టుపల్లిలో పశువుల డైయిరీ

మహేశ్వరం: వేసవి ఉష్ణోగ్రతలు గతేడాది కన్నా ఈ సారి అధికంగా నమోదయ్యే అవకాశాలున్నట్లు వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఎండల తీవ్రత అధికంగా ఉండడంతో వేడి గాలుల వల్ల పాడిపశువులు, గొర్రెలు, మేకలు, కోళ్లు, ఉష్ణతాపానికి గురై తీవ్ర అనారోగ్యానికి గురవుతాయి. ఈ పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను దుబ్బచర్ల పశువైద్యాధికారి డా.విశ్వేశ్వర్ వివరించారు. పశువుల్లో వడదెబ్బ సోకితే క్రమంగా నీరసించి, బలహీనంగా మారుతాయి. సరిగా నడవలేక తూలుతూ పడుకోవడానికి ప్రయత్నిస్తాయి. జీవక్రియ తగ్గిపోవడం, ఆకలి మందగించడం, వ్యాధి నిరోధక శక్తి తగ్గడం సంభవిస్తుంది. చూడి పశువుల్లో గర్భస్రావాలు సంభవించే అవకాశాలున్నాయి. వాటిలో దాహం పెరుగుతుంది. ఒక్కోసారి అపస్మారక స్థితికి వెళ్లి మరణిస్తాయి.

మేత..

వేసవి తాపంతో జీర్ణక్రియ సన్నగిల్లుతుంది. పిండి పదార్థాలైన గంజి, జావలాంటి పదార్థాలు అందించాలి. పచ్చిగడ్డి ఉదయం, ఎండిగడ్డి రాత్రి సమయాల్లో వేయాలి. పశుదాణాను నీటితో కలిపి ఇవ్వాలి. ఉదయం 6–10 , సాయంత్రం 4–7 గంటల సమయంలో మేతకు వదలాలి.

ఆరోగ్య పరిరక్షణ

వేసవి తాపానికి గురైన పశువుల్లో వ్యాధి నిరోధక శక్తి తగ్గడం వల్ల ఇతర వ్యాధులు సంక్రమించే అవకాశం ఉంది. వ్యాధి నిరోధక టీకాలు ఇది వరకు వేయించని పశువులు, గొర్రెలు, మేకల్లో గాలికుంటు, గొంతువాపు, జబ్బవాపు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి. మురుగునీరు తాగటం వల్ల పారుడు వంటి జీర్ణకోశ రోగం వచ్చే అవకాశం ఉంది. నట్టల నివారణ మందులు క్రమం తప్పకుండా తాగించాలి.

ప్రథమ చికిత్స

వడదెబ్బకు గురైన పశువులను వెంటనే చల్లని గాలి వీచే ప్రదేశంలోకి తీసుకెళ్లి శరీర ఉష్ణోగ్రత తగ్గించడానికి పలుమార్లు నీటితో కడగడం, తల నుదుటి మీద మంచుముక్కలు ఉంచడం లేదా చల్లని గోనె సంచిని దానిపై కప్పాలి. తక్షణం పశువైద్యుడిని సంప్రదించి ఆయన పర్యవేక్షణలో గ్లూకోజు సెలైన్, సోడియం క్లోరైడ్ అందించాలి. శరీర ఉష్ణోగ్రతలు తగ్గించడానికి చికిత్స చేయించాలి.

జాగ్రత్తలు తీసుకోవాలి



ఈ సంవత్సరం ఎండల తీవ్రత ఎక్కువగా ఉంది. చాలా పశువులు వడదెబ్బకు గురవుతాయి. అలాంటి ప్రమాదకరమైన పరిస్థితుల్లో పశువులకు గాలివీచే ప్రదేశాల్లోకి మార్చాలి. పశువుల కొట్టాలు, పాకలకు ఉత్తరం, దక్షిణం వైపు ఓపెన్‌గా ఉండేలా చూసుకోవాలి. పశువుల వీపుల మీద నీటితో తడిపిన తూట్లు వేయాలి. నీటిలో బెల్లం, ఉప్పు వేసి తాగించాలి. పశువులను చల్లటి నీటితో శుభ్రంగా కడుక్కోవాలి.

– డా.విశ్వేశ్వర్, పశువైద్యాధికారి, దుబ్బచర్ల

భక్తిశ్రద్ధలతో మహామృత్యుంజయ హోమం



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

మీర్‌పేట: మీర్‌పేట శివసాయినగర్ కాలనీలోని గౌరీ నీలకంఠేశ్వర స్వామి సమేత లక్ష్మీగణపతి దేవాలయంలో మాస శివరాత్రి సందర్భంగా సోమవారం సనాతన ధర్మ ప్రవర్తక సమితి ఆధ్వర్యంలో మహా మృత్యుంజయ హోమం నిర్వహించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. హోమంలో సాంబశివశర్మ, వంశీకృష్ణ, పార్థసారధి, వెంకట కృష్ణారావు, బాపిరాజు, గంగారామ కృష్ణ, లక్ష్మణరావు, శ్రీనివాస ప్రసాద్ పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో సబితారెడ్డి



చిన్నారులకు పండ్లను తినిపిస్తున్న సబితారెడ్డి

పహాడీషరీఫ్: జల్‌పల్లి గ్రామంలో సవూద్ పటేల్, సైఫ్ పటేల్‌ల ఆధ్వర్యంలో సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక మజీద్‌లో ముస్లింలకు పండ్లను తినిపించి ఉపవాస దీక్షలను విరమింపజేశారు. అనంతరం ఆమె ముస్లింలకు ముందస్తుగా ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు సూరెడ్డి కృష్ణారెడ్డి, షేక్ అఫ్జల్, యంజాల జనార్దన్, అర్జున్, అబ్బాస్, ఇద్రీస్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పుణ్యక్షేత్రంగా చేయడం అభినందనీయం

జెడ్పీ చైర్ పర్సన్ తీగల అనితారెడ్డి



భక్తులకు అన్నదానం చేస్తున్న అనితారెడ్డి

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్‌లోని బంగారు మైసమ్మ కాశీవైద్యనాథ దేవాలయంలో గోల్డెన్ వాకర్స్‌టీం ఆర్యవైశ్య గ్రూప్ ఆధ్వర్యంలో సోమవారం 500 మంది భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమానికి జెడ్పీ చైర్ పర్సన్ తీగల అనితారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఆలయాన్ని పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దడంతో నిత్యాన్నదానం చేయడం అభినందనీయమని దేవాలయ ఫౌండర్ ట్రస్టీలు బేర బాలకిషన్, ఆకుల అరవింద్‌లను అభినందించారు. కార్యక్రమంలో నాయకులు నల్లెంకి ధన్‌రాజ్‌గౌడ్, భార్గవ్‌రాజ్‌గౌడ్, అరుణ, రోజా, గోల్డెన్ వాకర్స్‌టీం సభ్యులు నగేష్ గుప్తా, ప్రభాకర్‌గుప్తా, శ్రీనివాస్‌గుప్తా, కే.ఎస్.గుప్తా తదితరులు పాల్గొన్నారు.

మీర్‌పేట బీజేపీ యువ మోర్చా అధ్యక్షుడిగా ప్రదీప్



ప్రదీప్‌కు నియామకపత్రం అందజేస్తున్న నర్సింహ

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ బీజేపీ యువ మోర్చా అధ్యక్షుడిగా కుతాడి ప్రదీప్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం కార్పొరేషన్ పార్టీ అధ్యక్షుడు పెండ్యాల నర్సింహ నియామక పత్రం ప్రదీప్‌కు అందజేశారు. అనంతరం ప్రదీప్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో పదవికి ఎంపిక చేసిన పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్పొరేషన్‌లో పార్టీని బలోపేతం చేయడంతో పాటు రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి విజయానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు గాజుల మధు, సోమేశ్వర్, బుచ్చిరాములు, యాదగిరి యాదవ్, బెల్లంకొండ నాగరాజు, కార్పొరేటర్లు హరినాథ్‌రెడ్డి, బాలకృష్ణ, భీంరాజ్ పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు (కిలో..రూల్లో) టమాట లోకల్ రూ.17, వంకాయ రూ.18, బెండకాయ 45, పచ్చిమిర్చి 55, కాకరకాయ 35, బీరకాయ 40, క్యాలీఫ్లవర్ 20, క్యాబేజీ 21, క్యారెట్ 25, దొండకాయ 18, ఆలుగడ్డ 35, ఉల్లిగడ్డ 22, గోకరకాయ 28, దోసకాయ 17, సొరకాయ 09, పొట్లకాయ 18, అరటికాయ 09, చిక్కుడు 50, అర్బి 35, మునగ 21, చిలగడ దుంప 65, బీట్‌రూట్ 23, కీర 22, ఫ్రెంచ్ బీన్స్ 55, కాప్సికమ్ 65గా ఉన్నాయి. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

పని ప్రదేశంలో సౌకర్యాలు కల్పించాలి

అడిషనల్ డీఆర్‌డీఓ శైలజ



ఎంపీడీఓ సరితకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



ఉపాధికూలీలతో మాట్లాడుతున్న శైలజ తదితరులు

కందుకూరు: ఎండలు దృష్ట్యా ఉపాధి కూలీలకు పని ప్రదేశంలో తగిన సౌకర్యాలు కల్పించాలని అడిషనల్ డీఆర్డీఓ అధికారులకు శైలజ సూచించారు. సోమవారం మండలంలోని జైత్వారంలో కొనసాగుతున్న ఉపాధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కూలీలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అలాగే, వననర్సరీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కూలీలకు కనీస వేతనం రూ.300 పెరిగిందన్నారు. కొలతల ప్రకారం వారితో పని చేయించాలన్నారు. పని ప్రదేశంలో నీడ, మెడికల్ కిట్లు, తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. ఆమె వెంట ఎంపీడీఓ సరిత, ఏపీఓ రవీందర్‌రెడ్డి, టీఏలు రవికుమార్, తిరుపతిరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సమస్యలు తీర్చాలి

కందుకూరు: ఉపాధిహామీ కూలీల సమస్యలు పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి అంకగళ్ల కుమార్ సోమవారం ఎంపీడీఓ సరితకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించడం లేదని, ఎండలు పెరిగినా తాగునీరు, మెడికల్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, నీడ కల్పించడం లేదని ఆరోపించారు. ప్లే స్లిప్‌లు కూడా ఇవ్వడం లేదని చెప్పారు. కూలీలు రెండు నెలలుగా డబ్బులు రాక నానా ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ప్రతివారం ప్లే స్లిప్పులు ఇచ్చి, వారం వారం డబ్బులు ఖాతాల్లో జమ చేయాలన్నారు. 200 రోజుల పని దినాలు కల్పించి, కొలతలతో సంబంధం లేకుండా రూ.600 చొప్పున కూలి ఇవ్వాలని, రెండు పూటలా ఫొటో విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఉదయం పూటే పని కల్పించాలని కోరారు. దరఖాస్తు పెట్టుకున్న ప్రతి ఒక్కరికి పని కల్పించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు శేఖర్, సత్తయ్య, కె.భూమేష్, సురేష్ పాల్గొన్నారు.

ఘనంగా అమావాస్య హోమం




ప్రవచనాలు బోధిస్తున్న గురూజీ, పాల్గొన్న భక్తులు



హోమంలో పాల్గొన్న గురూజీ అనిల్‌కుమార్ జోషి, భక్తులు

కందుకూరు: మండలంలోని పులిమామిడి పరిధిలోని శ్రీనిఖిల్ చేతనా కేంద్రంలో అమావాస్యను పురస్కరించుకుని బ్రహ్మశ్రీ గురూజీ అనిల్ కుమార్‌జోషి ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్ణాహుతి పూర్తి చేసి భక్తులకు ఆశీర్వాదాలు, అన్నదానం చేశారు. అనంతరం గురూజీ ప్రవచనాలు చేశారు. ప్రతి నిత్యం భగవంతుడి సాధనలో కొంత సమయాన్ని గడపాలన్నారు. ప్రస్తుత సమాజంలో ఎదురైయ్యే అటుపోట్లను తట్టుకుని ముందుకు సాగడానికి మార్గం సుగమమవుతుందన్నారు. లక్ష్యాన్ని ఎంచుకొని సన్మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నేడు ఔట్ పేషెంట్ బ్లాక్ ప్రారంభం



అవేర్ సంస్థ చైర్మన్ మాధవన్‌జీ

మహేశ్వరం: మండలంలోని మొహబ్బత్‌నగర్ గ్రామ సమీపంలో ఉన్న భగవతి పురంలో అవేర్ సంస్థ ఆధ్వర్యంలో ఆరోగ్యధామ్ ఆస్పత్రిని మంగళవారం ఏర్పాటు చేస్తున్నామని అవేర్ సంస్థ చైర్మన్ మాధవన్‌జీ పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. గ్రామీణా ప్రాంత పేదలకు ఆరోగ్యపరంగా అవేర్ సంస్థ ఆధ్వర్యంలో ఎన్నో రకాల సేవలు అందిస్తున్నామన్నారు. గ్రామాలు, గిరిజన తండాల్లో ఉచితంగా ఆరోగ్య శిబిరాలు నిర్వహించి, మందులు పంపిణీ చేసి ఉచితంగా ఆపరేషన్లు చేయించామని చెప్పారు. ఆరోగ్య ధామ్ పేరిట మాధవన్‌జీ ఆస్పత్రి, ఆయుర్వేదిక్, యూనాని, హోమియో, వెల్‌నెస్, యోగా శిక్షణ, ఆయుష్ కేంద్రం, ఆయుష్ పరిశోధన కేంద్రం, మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజ్, ల్యాబ్స్, ఫిజియోథెరఫీ కాలేజీ ,సేంద్రియ ఉత్పత్తుల విక్రయ కేంద్రం, అంబులెన్స్ సేవలను త్వరలో భగవతి పురంలో దశలవారీగా ఏర్పాటు చేయబోతున్నామని తెలియజేశారు. ఉగాది పర్వదినం సందర్భంగా ఔట్ పేషెంట్ బ్లాక్‌ను ప్రారంభిస్తామని తెలిపారు. రోగులు వచ్చి వైద్య పరీక్షలు చేసుకోవాలని ఆయన కోరారు.

పారిశుద్ధ్య కార్మికులకు చీరల పంపిణీ

దిల్‌సుఖ్‌నగర్: అన్ని దానాల కంటే అన్నదానం గొప్పదని యువజన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆర్‌కేపురం డివిజన్ పరిధిలోని యాదవనగర్‌లోని శ్రీకృష్ణ దేవాలయం వద్ద అమావాస్య సందర్భంగా రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ, ఆర్‌కేపురం డివిజన్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నదానం, జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య మహిళ కార్మికులకు ఉగాది సందర్భంగా చీరలను పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉపేందర్‌రెడ్డి పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్యవైశ్యులు ఎక్కడ ఉన్నా.. సేవగుణంతో ఉంటారన్నారు. ఆర్యవైశ్య మహాసభ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు తాడేపల్లి వెంకటేషం గుప్తా, శ్రీకృష్ణ దేవాలయం చైర్మన్ యాదగిరిరెడ్డి, ఆర్‌కేపురం డివిజన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ప్రొద్దటూరి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిలు మాడిశెట్టి నాగేంద్రయ్య గుప్తా, శ్రావణ్‌కుమార్ గుప్తా, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉప్పల బాలశ్యామ్, ఎన్టీఆర్‌నగర్ ఆర్యవైశ్య సంఘం యూత్ అధ్యక్షుడ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు ఆలయం ముస్తాబు



విద్యుద్దీపాల అలంకరణలో ఆలయం

కొందుర్గు: ప్రతి ఏడాది ఉగాది, దసరా పండగలకు కొందుర్గు లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, అక్కడి నుంచి స్వామివారిని పల్లకీసేవతో పెండ్యాల లక్ష్మీనర్సింహస్వామి ఆలయం వరకు ఊరేగింపు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా నిర్వాహకులు స్వామివారి ఆలయాన్ని రంగు రంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. ఉగాది పండగ సందర్భంగా మంగళవారం ఉదయం ఆలయంలో అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేయనున్నట్లు ఈఓ శ్రీనివాసశర్మ తెలిపారు. సాయంత్రం 4 గంటలకు పల్లకీ సేవ, 7 గంటలకు పంచాగ శ్రవణం కార్యక్రమాలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని సూచించారు.

నియామకం

చేవెళ్ల: ముదిరాజ్ ఎంప్లాయిస్, ప్రొఫెషనల్స్ అసోషియేషన్(ఎంఈపీఏ) జిల్లా ప్రధాన కార్యదర్శిగా చామంతి కృష్ణముదిరాజ్ నియామకమయ్యారు. ఇటీవల జరిగిన రాష్ట్ర మెపా(ఎంఈపీఏ) కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్‌ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి బి.సంజీవన్‌కుమార్, గౌరవాధ్యక్షుడు డాక్టర్ బోయిని జగన్‌మోహన్‌ల ఆధ్వర్యంలో మల్కాపూర్ గ్రామానికి చెందిన చామంతి కృష్ణముదిరాజ్‌ను జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఈ సందర్భంగా సోమవారం కృష్ణముదిరాజ్ విలేకరులతో మాట్లాడుతూ.. ముదిరాజ్‌ల అభివృద్ధి, ఐక్యత కోసం అందరినీ కలుపుకొని ముందుకు వెళ్తానని చెప్పారు. జిల్లాలో అన్ని మండల కమిటీలను పూర్తి చేసేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. పూర్తిస్థాయిలో మెపా కార్యక్రమాల్లో పాల్గొంటూ సహాయ సహకారాలు అందిస్తానని పేర్కొన్నారు. తనపై ఎంతో నమ్మకంతో జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎంపిక చేసిన మెపా రాష్ట్ర, జిల్లా సంఘం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు సంఘం సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

‘మా ఊరికి బస్సు సౌకర్యం కల్పించండి’



డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న యువకులు

మహేశ్వరం: తుమ్మలూరు గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని సోమవారం ఆ గ్రామ యువకులు, విద్యార్థులు మహేశ్వరం ఆర్టీసీ డిపో మేనేజర్ మోహన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. తుమ్మలూరుకు గతంలో ఆర్టీసీ బస్సు నడిపేవారని కోవిడ్ వచ్చినప్పటి నుంచి బస్సులను నిలిపివేశారని వాపోయారు. బస్సులు నిలిపివేయడంతో నిత్యం రైతులు, విద్యార్థులు, మహిళలు, ఉద్యోగులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఎండలో నిత్యం తుమ్మలూరు నుంచి తుమ్మలూరు గేటు వరకు నడుచుకుంటూ వెళ్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వెంటనే గ్రామానికి ఆర్టీసీ బస్సు సర్వీసును నడిపించాలని డిపో మేనేజర్‌ను కోరారు. త్వరలో డిపో నుంచి ఫీల్డ్ ఆఫీసర్‌ను గ్రామానికి పంపించి బస్సు సౌకర్యం కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తుమ్మలూరు గ్రామ యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

‘కాంగ్రెస్ గ్యారంటీలు పక్కా అమలు’

వనస్థలిపురం: కాంగ్రెస్ పార్టీ గ్యారంటీ ఇచ్చిందంటే పక్కా అమలు చేస్తుందని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మల్కాజిగిరి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డితో కలిసి సోమవారం బీఎన్‌రెడ్డినగర్ డివిజన్, వనస్థలిపురం డివిజన్ల పరిధిలో ఆయన మార్నింగ్‌వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా వాకర్స్‌తో ముచ్చటించి పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతివ్వాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను విస్మరించిందని, ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి మోసం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు రాహుల్‌గాంధీ ప్రకటించిన ‘ఐదు న్యాయ’ గ్యారంటీలను ఖచ్చితంగా అమలు చేస్తామన్నారు. పట్నం సునీతామహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో సమస్యలు తనకు తెలుసునని, తాను జెడ్పీ చైర్మన్‌గా ఉన్నప్పుడు నాగోల్ జిల్లా పరిషత్ పాఠశాల, ఇతర మౌళిక సదుపాయాలకు నిధులు ఇచ్చానన్నారు. తనను గెలిపిస్తే ప్రత్యేక నిధులు తీసుకొచ్చి ఈ ప్రాంతం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. బీఎన్‌రెడ్డినగర్, వనస్థలిపురం డివిజన్ల అధ్యక్షులు మకుటం సదాశివుడు, కుట్ల నర్సింహాయాదవ్, జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, సామ రమణారెడ్డి, ఈశ్వరమ్మ యాదవ్, శాలిని, రామారావు, వేణు, శ్రీనివాస్ గౌడ్, వేములయ్యగౌడ్, స్వర్ణమాధవి, ఉమేష్‌గౌడ్, రవీందర్, వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించాలి

మొయినాబాద్: విద్యార్థులు చదువుతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించాలని అరిస్టాటిల్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని చిలుకూరు రెవెన్యూలో ఉన్న అరిస్టాటిల్ పీజీ కళాశాలలో సోమవారం ఉగాది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉగాది పచ్చడి తయారీపై పోటీలు నిర్వహించారు. విద్యార్థులు గ్రూపులుగా షడ్రుచుల ఉగాది పచ్చడిని తయారు చేశారు. అనంతరం విద్యార్థులకు వివిధ రకాల క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన పండగలు, ఉత్సవాలు, సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. అందుకే ప్రతి ఒక్కరూ పండగలు, ఉత్సవాల విశిష్టతను తెలుసుకోవాలన్నారు. తెలుగు కొత్త సంవత్సరం ఉత్సవంగా ఉగాది పండగను జరుపుకొంటామని చెప్పారు. కార్యక్రమంలో అధ్యాపకులు మల్లారెడ్డి, సురేశ్, దీప్తి, శ్వేత, కనకారావు, కిశోర్, జ్యోతికసోని, విద్యార్థులు పాల్గొన్నారు.